క్లుప్తంగా

అజాత శత్రువు మాజీ సర్పంచి అల్లం మర్రెడ్డి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



రెంటచింతల: మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచిగా 18 ఏళ్లు సేవా దృక్పథంతో పనిచేసి అజాత శత్రువుగా మాజీ సర్పంచి అల్లం మర్రెడ్డి పేరు పొందారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం రెంటచింతలలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత మర్రెడ్డి చిత్రపటం వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచి అల్లం ప్రతాప్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బి. రామకృష్ణ, తుమ్మా జోజిరెడ్డి, మున్నా ప్రభరాజు, సిద్దయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు





రెంటచింతల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని ఆంజనేయస్వామి మాన్యం కాలనీకి చెందిన దాసరి రాజశేఖర్, తాయ నరసింహారావు ఇద్దరు ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న గుంటూరు–మాచర్ల ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టి కింద పడ్డారు. వారిద్దరికి తలకు కాళ్లకు తీవ్రమైన గాయాలు కాగా వెంటనే ప్రైవేటు అంబులెన్స్‌లో గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయగా వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. ఈ మేరకు ఎస్ఐ సీహెచ్ నాగార్జున ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు

సత్తెనపల్లి: అరుణాచలానికి ఈ నెల 8న రాత్రి 9 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ (2+2 పుష్ బ్యాక్) బస్సు బయలుదేరుతుందని ఆర్టీసీ సత్తెనపల్లి డిపో మేనేజర్ జీఎస్‌వీ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అదే రోజు రాత్రికి అరుణాచలం చేరుతుందని పేర్కొన్నారు. దర్శనం అనంతరం తిరిగి 10న కంచి చేరుతుందని, దర్శనం అనంతరం రాత్రికి బస్సు బయలుదేరి ఈనెల 11న ఉదయం సత్తెనపల్లి వస్తుందని వివరించారు. టిక్కెట్ ధర రానుపోనూ ఒక్కొక్కరికీ రూ.2,500 మాత్రమేనని తెలిపారు. భక్తులు, యాత్రికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9959225429, 7382897583, 7382896966, 7382897116 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల తన కార్యాలయంలో శనివారం 32 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.31,01,938 విలువైన చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. పట్టణంలోని 20వ వార్డులో కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనకు తొలి అడుగు పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు షేక్ మస్తానవలి, చౌటా శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా పట్టణంలోని నాలుగు కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. మొదటి బెంచ్‌కు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్ కుమార్ రెడ్డి, సభ్యుడిగా బొమ్మిశెట్టి శ్రీనివాసరావు వ్యవహరించారు. రెండో బెంచ్‌కు సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిధ్ హుస్సేన్, సభ్యుడిగా పాటిబండ్ల రవి, మూడో బెంచ్‌కు ఒకటవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి. ప్రియదర్శిని, సభ్యుడిగా ఆకుల నాగార్జున వ్యవహరించారు. నాలుగో బెంచ్‌కు రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జె. సుజిన్ కుమార్, సభ్యుడిగా కంబాల అనిల్ కుమార్ వ్యవహరించారు. నాలుగు కోర్టుల పరిధిలో సివిల్– 85, క్రిమినల్ – 780, ప్రీలిటికేషన్ –3 కలిపి 868 కేసులకు గానూ రూ.2,40,88,097 చేతులు మారాయి. కార్యక్రమాల్లో న్యాయ వాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.

కొత్త భవనానికి కూటమి గ్రహణం!

- వైఎస్సార్ సీపీ హయాంలో మున్సిపల్ మొదటి అంతస్తు నిర్మాణం పూర్తి
- ఇంకా ప్రారంభానికి నోచుకోని వైనం
- శిథిలావస్థకు చేరిన పాత మున్సిపల్ కార్యాలయం



నూతనంగా నిర్మించిన పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం

పిడుగురాళ్ల: మున్సిపల్ కార్యాలయానికి కూటమి గ్రహణం వీడినట్లు కనిపించడం లేదు. రూ.కోట్లతో నిర్మించిన నూతన భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. అందుకు ప్రస్తుత ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదు. దీంతో పాత భవనంలో పాలకవర్గం అవస్థలు పడుతోంది.

కొత్త భవనం నిర్మాణం ఇలా..

సుమారు రూ.2 కోట్లతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక నిధులు తీసుకొని వచ్చి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలన్న లక్ష్యంతో తహసీల్దార్ కార్యాలయం పక్కన నూతన మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కార్యాలయానికి రహదారి కూడా వెడల్పు చేసి ప్రజల రాకపోకలకు కూడా సౌకర్యవంతంగా ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తు నిర్మాణ పనులు పూర్తి అయిన తర్వాత భవనాన్ని కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. ఆ తర్వాత ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది దాటినా మున్సిపల్ కార్యాలయాన్ని ఉపయోగించటం లేదు. పాత భవనంలోనే పరిపాలన విభాగం కొనసాగుతోంది.

శ్లాబ్ పెచ్చులూడినా...

పాత భవనం ఎప్పుడు శ్లాబ్ ఊడిపడుతుందోనని అధికారులు భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. మొదటి భవనంలో మరన్ని సౌకర్యాల కోసం జనరల్ ఫండ్స్ నుంచి సుమారు రూ.90 లక్షల వరకు మంజూరు చేసి పనులను ఇప్పుడు చేపట్టారు. చాలీచాలని పాత మున్సిపల్ భవనంలో అసౌకర్యంగానే విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యాలయంగా ఉన్న పాత భవనమే మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించటంతో ఇబ్బందులుపడుతున్నారు. పాత కార్యాలయం పట్టణ నడిబొడ్డు ఉండటం, ప్రజల రాకపోకలకు రహదారి చిన్నగా ఉండటంతో ప్రజలు కూడా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.



పాత మున్సిపల్ కార్యాలయం

ఆగస్టు 15న ప్రారంభిస్తాం



నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని ఆగస్టు 15వ తేదీన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చిన్న చిన్న పనులు నిర్వహించటం జరుగుతుంది. 15 లోగా పూర్తి చేయిస్తాం. పాత భవనం పాలన విభాగానికి అసౌకర్యంగా ఉంది. అందరికి సౌకర్యవంతంగా ఉండే నూతన మున్సిపల్ కార్యాలయం వెంటనే ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

–కొత్త వెంకట సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్

బీటీ 3 పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు



వ్యవసాయ శాఖఅధికారిణి సంధ్యారాణి

పిడుగురాళ్ల: విత్తన దుకాణ యజమానులు బీటీ 3 పత్తి విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఓ సంధ్యారాణి హెచ్చరించారు. పట్టణంలోని ఏవో కార్యాలయం శనివారం విత్తన షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులకు ఎమ్మార్పీ ధరలకు మాత్రమే పత్తి విత్తనాలు అమ్మాలని, అమ్మినప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నిషేధించిన బీటీ 3 పత్తి విత్తనాలు ఎవరైనా అమ్మితే అటువంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మినా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఫసల్ బీమాను ఉపయోగించుకోండి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ పంటల బీమా రెండు పథకాలు ప్రవేశపెట్టటం జరిగిందని ఏఓ చెప్పారు. పీఎం ఎఫ్‌బీవై పథకం కింద దిగుబడి ఆధారంగా వరి, కంది, మిర్చి మూడు పంటలకు ఖరీఫ్ కాలానికి గుర్తించారని వివరించారు. వరి పంటకు గ్రామాన్ని బీమా యూనిట్‌గా, కంది, మిరప పంటలకు మండలాన్ని బీమా యూనిట్‌గా పరిగణిస్తారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో ఫ్యూచర్ జనరల్ కంపెనీ బీమా ఏజెన్సీగా పని చేస్తుందని చెప్పారు. ఆర్‌డబ్ల్యూ బీసీఐఎస్ పథకం ద్వారా పల్నాడు జిల్లాల్లో పత్తి పంటను మండల యూనిట్లుగా గుర్తించారని వివరించారు. పత్తి పంటకు గాను ఎకరాకు ప్రీమియం రూ.1900, వరికి ఎకరాకు ప్రీమియం రూ.80, కందిపంటకు ఎకరాకు ప్రీమియం రూ.40, మిరప పంటకు ఎకరాకు ప్రీమి యం రూ.360 చెల్లించాలన్నారు. ఎంట రుణం తీసుకొని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నేషనల్ క్రాఫ్ ఇన్సురెన్స్ పోర్టల్‌లో ఖరీఫ్ నుంచి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ పేర్కొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవ వేడుకలు



ఏఈఎల్సీ నాయకుడు ఐజయ్యని సన్మానిస్తున్న సంఘస్తులు

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ చర్చి 5వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ గనిపల్లి శ్యాం ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక వాక్యోపదేశాన్ని ఆయన అందించారు. ఏఈఎల్సీ నేత గొట్టిముక్కల ఐజయ్య ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మేళతాళాలతో ఊరేగింపుగా చర్చిలోనికి తీసుకువచ్చారు. అనంతరం శాలువా పూలదండలతో సంఘస్తులు సన్మానించారు. సంఘం ఐకమత్యంతో ఉండి ప్రభువైన ఏసుక్రీస్తులో దినదినం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వార్షికోత్సవం సందర్భంగా 2,500 మందికి అన్నదానం చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు మోజెస్, సాగర్ బాబు, ప్రభుదాసు ఆనంద్, ఏఈఎల్సీ ప్రతినిధి వినుకొండ బాబు, చర్చి డెలిగేటు శ్రీపతి కాశయ్య, సర్పంచి చెట్టిపోగు ఏసుదానం, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, మాజీ సర్పంచి వినుకొండ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల ఎంపిక



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల నియోజకవర్గంలోని కారంపూడి, వెల్దుర్తి మండల కమిటీలను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

కారంపూడి మండలం..

పార్టీ మండల అధ్యక్షుడిగా కొంగర సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా గురజాల రామారావు, వెన్నపూస జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా చిరుమామిళ్ల నరసింహారావు, అలవాల రాజశేఖర రెడ్డి, వేంపాటి నాగిరెడ్డి, కొర్రపాటి ఆంజనేయులు, కార్యదర్శులుగా పంగులూరి నరసింహారావు, దొంతా వీరాంజనేయులు, యరసాని బుచ్చిరెడ్డి, బత్తుల భైరాగివర్మ, బుర్రి రాముగురవయ్య నియమితులయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బత్తుల అనంతలక్ష్మయ్య, అల్లా శంకరరెడ్డి, పాలకీర్తి శ్రీను, పులిమి శ్రీనివాసరావు, దిబ్బమాడుగు వీరయ్య, పెల్లూరి భిక్షం, కడియం వెంకటరావు, చేవూరి సుబ్బారావు, సూరే మోషయ్య, కడియం భూషణం, చిలుకూరి రవీంద్రరెడ్డి, గంటా కృష్ణ, బొణుకూరి శంకర్, మల్లా రామాంజనేయులు, షేక్ బాషా నియమితులయ్యారు.

వెల్దుర్తి మండల కమిటీ..

మండల కమిటీ అధ్యక్షుడిగా కోట్ల పాపిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఈగెల అయ్యన్న, వంకణావత్ రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శులుగా పోలకం వెంకటనారాయణ, పిన్నెల్లి హనిమిరెడ్డి, గుంటక మార్కొండారెడ్డి, శీలం చినసైదారెడ్డి, కార్యదర్శులుగా భూమిరెడ్డి సీతారామిరెడ్డి, గన్నెబోయిన సంజీవ, రామావత్ సైదానాయక్, ఉప్పుతోళ్ల మధు నియమితులయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నక్కా రామాంజి, గంగనబోయిన మణికంఠ, తోట శ్రీనివాసరావు, పంగులూరి బాబూరావు, బాలిగొడుగుల వెంకటేశ్వర్లు, నల్లపు వెంకటరెడ్డి, జరపల శివ, దేవిరెడ్డి రామకృష్ణారెడ్డి, తంగిరాల రమణారెడ్డి, బాణావత్ అంజినాయక్, మేఘావత్ హనుమానాయక్, ఇస్లావత్ అంజినాయక్, దేసావత్ భైఖ్యానాయక్, నాగిరెడ్డి వెంకటరామిరెడ్డి, వల్లెపు శివ, అక్కెం శ్రీను, మోరబోయిన మోజేష్, తోట కోటేశ్వరరావు, తాళ్ల శివయ్య నియమితులయ్యారు.

విద్యార్థులకు ప్రతాప్‌రెడ్డి మాస్టారు ఆదర్శం

ప్రిన్సిపాల్ మల్లాది వనపాల్‌రెడ్డి



బాసాని ప్రతాప్‌రెడ్డి మాస్టార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కారెంపూడి(రెంటచింతల): అంకితభావంతో ఉపాధ్యాయ, అధ్యాపకులుగా 33 ఏళ్లు విధులు నిర్వహిస్తూ నిత్యజీవన విధానంపై విద్యార్థులకు పరిపూర్తిగా అవగాహన కల్పిస్తూ వారిని సన్మార్గంలో నడిపించి బాసాని ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు రోల్ మోడల్ అని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మల్లాది వనపాల్‌రెడ్డి అన్నారు. శనివారం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ, అధ్యాపకులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ప్రతాప్‌రెడ్డి సన్మానసభ నిర్వహించారు. 1992 సెప్టెంబర్ నుంచి సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ప్రతాప్‌రెడ్డి అనేక ప్రాంతాలలో విద్య పరంగా అమూల్యమైన సేవలు అందజేశారని కొనియాడారు. మనోవిజ్ఞాన శాస్త్రవిద్యా నిపుణులుగా ఆయన విద్యార్థులకు విద్యతో పాటు వారి మనస్తత్వాన్ని అర్థంచేసుకుని వారికి విలువలతో కూడిన జీవితాన్ని ఎలా జీవించాలో నేర్పించారన్నారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి, మేరి దంపతులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.వేమభూషణం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు వంశీకృష్ణ, అల్లాబాషా, డి.శ్రీనివాసరెడ్డి, మారుతి, అచ్చమ్మ, లక్ష్మీజ్యోతి పాల్గొన్నారు.

చెస్‌తో చిన్నారుల్లో నైపుణ్యాల వృద్ధి



చిన్నారికి బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్

మాచర్ల రూరల్: చెస్‌తో మేధాశక్తి పెరుగుతోందని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ అన్నారు. పట్టణంలోని బీఎస్ఆర్ కల్యాణ మండపంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్నాడు జిల్లా చెస్ పోటీలు అండర్– 15 జట్ల ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి క్రీడా శక్తి, బలం ఉపయోగించాల్సి ఉండగా ఒక్క చెస్ మాత్రమే మేధను ఉపయోగించి గెలవవచ్చునన్నారు. ఎదుటి వారు చిన్నా, పెద్ద అని కాకుండా తెలివితేటలతో ఓడించే అవకాశముంటుందన్నారు. జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ తరఫున వందలాది మంది విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించటం జరుగుతుందని చెప్పారు. మన ప్రాంతంలో పల్నాడు చెస్ అకాడమి కోచ్ ఏర్పాటు చేసి వందలాది మంది విద్యార్థులకు చెస్‌లో ప్రావీణ్యాన్ని పెంపొందించి రాష్ట్ర, దేశ స్థాయిలో బహుమతులను తీసుకొస్తున్న కోచ్ కె.కిరణ్ కుమార్ కృషి ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా 1,2 స్థానాలలో నిలిచిన కేజే మాగ్నెస్, కేఎస్ మోజెస్, దీక్షిత, డి.మహితలకు బహుమతులు అందజేశారు. వీరు అండర్– 15 విశాఖపట్నంలో ఈ నెల 12, 13 నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా నుంచి ప్రాధాన్యం వహిస్తారని కోచ్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ భవనాశి రవితేజ, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, బచ్చు రాజ్ కుమార్, చుండూరు సత్యనారాయణ, ఎ.వీరాంజనేయులు పాల్గొన్నారు.

స్టేడియం పేరుపై టీడీపీలో సిగపట్లు

- ఎమ్మెల్యే కన్నా పేరు పెట్టాలంటూ ఒక వర్గం
- కాదు మాజీ స్పీకర్ కోడెల పేరు పెట్టాలని మరో వర్గం
- స్టేడియం ప్రారంభ కార్యక్రమం వాయిదా పడే అవకాశం



పట్టణంలోని స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: టీడీపీలో స్టేడియం పేరుపై సిగపట్లు తప్పడం లేదు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో స్టేడియం నిర్మాణం అప్పటి శాసనసభ్యుడు, మాజీ స్పీకర్ దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో ప్రారంభమైంది. చివరి దశలో ఉన్న సమయంలో నిధులు మంజూరు కాకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రస్తుత శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రయత్నాలు చేపట్టారు. ఏడాదిలో పలుమార్లు ఆయన పరిశీలన కూడా చేశారు. అయితే ప్రారంభోత్సవం ఇదిగో.. అదిగో అంటూ వాయిదాలు పడుతూ వచ్చింది. ఏడాదిలో చేసింది ఏదైనా చూపాలంటే ప్రస్తుతం స్టేడియం నిర్మాణం మాత్రమే కనిపిస్తోంది.

9న ప్రారంభించేందుకు సన్నాహాలు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న క్రీడల శాఖ మంత్రిని ఆహ్వానించి ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం స్టేడియాన్ని స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ నాయకులతో కలిసి పరిశీలించారు. అయితే, స్టేడియానికి పేరు పెట్టడంపై వివాదం నెలకొంది. ప్రస్తుత శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పేరు పెట్టాలని ఒక వర్గం ముమ్మర ప్రయత్నాలు చేస్తుండగా .. కాదు స్టేడియం నిర్మాణం చేపట్టింది దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని, ఆయన పేరే పెట్టాలంటూ టీడీపీలోని మరో వర్గం బయటకు వచ్చింది. ఇప్పటికే పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్, టీడీపీ పట్టణ తాజా మాజీ అధ్యక్షుడు కటకం రామకృష్ణ స్టేడియానికి శివప్రసాదరావు పేరు పెట్టాలని పట్టుబట్టారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేరును వ్యతిరేకిస్తూ ఈ నెల 30న నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రకటించమే కాకుండా అధికారులకు లిఖితపూర్వకంగా డీసెంట్ ఇచ్చాడు. దీంతో ఒక వర్గం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేరును, మరో వర్గం మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద రావు పేరును ప్రస్తావిస్తూ తెరపైకి రావడంతో స్టేడియం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేసే ఆలోచనలో పాలకులు ఉన్నట్లు తెలుస్తోంది.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: జనసంఘను స్థాపించి ఆధునిక హిందుత్వ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించిన దేశ భక్తుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి-1 ఏ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, మేరా యువ భారత్ గుంటూరు (మై భారత్) సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత దేశ రాజకీయాలలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు ముఖర్జీ అని కొనియాడారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసంఘతో దేశంలో తొలి హిందూ వాద రాజకీయ పార్టీని స్థాపించిన మహోన్నత వ్యక్తి ముఖర్జీ అని కొనియాడారు. హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ దేశ విభజనను వ్యతిరేకించిన వారిలో శ్యాంప్రసాద్ ముఖర్జీ ముఖ్యుడని తెలిపారు. ఐసీడీఎస్ ఏసీడీపీఓ సంతోషమ్మ మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జన్మదినోత్సవం సందర్భంగా రెండవ వార్డు అంగనవాడీ సెంటర్‌లో మొక్కలు నాటడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమానికి టీచర్ మస్తాన్ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్ బాబు అధ్యక్షత వహించారు. ముందుగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, జ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కుమారి, పల్నాడు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ అధికారి ప్రశాంత్, నానమ్మ హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు చంద్రకళ, ఐటీఐ కాలేజీ ట్రైనర్ శ్రావణి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న పాశ్వాన్



పాశ్వాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: భారత రాజకీయాల్లో రామ్ విలాస్ పాశ్వాన్ ఐదు దశాబ్దాలుగా చెరగని ముద్ర వేసుకున్నారని లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ పేర్కొన్నారు. పాశ్వాన్ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. న్యాయ శాస్త్రం చదివిన పాశ్వాన్ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ఎనిమిది సార్లు లోక్ సభకు, ఒకసారి రాజ్యసభకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లో పేదలు సామాజిక, రాజకీయ, ఆర్థికాభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారని వివరించారు. పాశ్వాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమపాఠశాలలో అన్న సంతర్పణ, మొల్లమాంబ వృద్ధాశ్రమంలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారుమంచి గంగరాజు, షేక్ షరీఫ్, సుభాని, నలబోలు ప్రసన్న రాజా, మహంకాళి వెంకటరావు, రత్తయ్య, కంభంపాటి ఆశీర్వాదం పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

అమరావతి: మండల పరిధిలోని మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు, ఎంపీపీ మేకల హనుమంతరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగేళ్లలో మునుగోడులో రూ. 4కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మేకల శివశంకర్, షేక్ షరీఫ్, బీజేపీ నాయకులు నేలపాటి జయకుమార్, గణపా వెంకట్రామిరెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వరరావు, బంకా బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 227 కేసులు పరిష్కారం

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయ అవగాహన సదస్సు, జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. న్యాయమూర్తి టి.ప్రవల్లిక మాట్లాడుతూ.. ప్రజలు న్యాయ సేవల గురించి లోక్ అదాలత్ గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అనంతరం లోక్ అదాలత్‌లో మొత్తం 227 కేసులు పరిష్కరించారు. పరిష్కారం కింద మొత్తం రూ.1,23,47,024 కక్షిదారులకు ఇప్పించటం జరిగిందని న్యాయమూర్తి టి. ప్రవల్లిక తెలిపారు. కార్యక్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సులో లోక్ అదాలత్ మెంబర్ జి.రమేష్, పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమార స్వామి, సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, న్యాయవాదులు కె.కోటేశ్వరరావు, ఎస్‌కే మౌలాలి, ఎస్‌పీ కోటేశ్వరరావు, అయాజ్ అహ్మద్, ప్రశాంత్‌కుమార్‌నాయక్, ఎ.సీతారామయ్య, మందా జాకబ్, ఏ రూత్ బనియన్, ఎం.వెంకటేశ్వర్లు, కె.సాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రవల్లిక

నేడు వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రాజుపాలెం: స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చైర్మన్ పొత్తూరి వెంకట రమా సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు.